# 50. ఒవల్లని ఆల్లే రశ్శించుకోవాల!

**అ**లా ఆడిని గాలిలో తేలిపోయే నాగ సేసినాను గందా..ఆ దూకుడికి తట్టుకోనేక గదిలోకి సేరినాను గందా... ఒల్ల కూరుకోనేక పోయింది నా గుండె. సుట్ట ముక్క ముట్టించినాను. రింగు రింగుల బయలెల్లే ఆ పొగ ఎనక్కి ఎనక్కి సుట్టుకుంటూ ఎన్నెన్ని యిసయాలు యాదికి తెచ్చినాదో.

✪

మా యమ్మా, సిన్నత్తా, పెద్దకా, నానూ మేమందరం ఓ పూరిపాకలో ఉంటేటోల్లం. కట్టపడ్డా తెగ తాగేసి కాన్దబ్బు యింటికియ్యని మొగోల్లని తన్ని తగిలేసినాం గనక, మా పాకల ఆడోల్లదే సామరాజ్జెం. పయిట ఏసుకొని యింకా ఏడాది దాట్నేదు గనక నన్నింకా కూలికి రానిచ్చేటి వోరు కారు. ఆల్లూ అలా ఎల్లనిచ్చి తడిక తలుపు దగ్గిరగా ఏసి ఎదురింటి మేడమీని చూడెంటు కుర్రోడి గదిలోకి తప్పుకునేదాన్ని. ఆడాదాయికి అదిగలాంటి సోట కితకితలు మారమ్మగా ఉంటాయని తొలిసుట్టు తెలుసుకున్నాక అట్టాంటిది మల్లీ మల్లీ కావాలనిపించేది. ఆ చంగతి పోల్చిన సుట్టుపక్కల పడుసోళ్ళు ఇజిల్సు మీన ఇజిల్సు కొట్టేటివారు. మా అమ్మ కొట్టింది, తిట్టింది, వాతలు పెట్టినాది. 'ఈదిన పడి రోజు కూలీ సెస్తే గాని రెక్క కట్టం ఆడకూతుల్లం. పని సూపిచ్చిన మేత్తిరీ బాబు పక్కలోకి రమ్మంటే ఎల్లకపోతే మర్నాడు పని దొరక్క పస్తులుండే దిక్కుమాలినోల్లం. సచ్చినట్టు పడుండక పోకిరీ యాసాలు ఏసేవా పొయ్యిలో ఎట్టేస్తా' అని బెదిరించినాది. ఉడుకుపట్టిన వణ్ణం ఊరుకోనేదు గందా! సైకిలు రిపేరు సేసే సాయిబుల కుర్రోడితో లేసి ఒచ్చేసినాను. ఈయిదంగా సేతులు మారిన పడుసు గుంటని ఏ యిదేశాలకి ఎగుమతై ఎక్కడ కుల్లికుల్లి సచ్చేదాన్నో! ఆ బగుమంతుడే చూరపరాజు బాబుగోరి రూపంలో పెత్యచ్చమై నన్ను ఆదుకున్నారేమో. నా ఎత్తుపల్లాలకి ఎగబడితే ఏటయినాది. పెరమనెంటుగా నాకో దారి సూపించినారు. ఆ పెద్ద గుండె మనిషి ఈ పోతరించిన ముండకి సేసినవి ఒకటా రెండా! మందులిప్పించి కొరుకుడు రోగాలు తగ్గించినారు. పోలీసు రాకాసుల్నుండి రచ్చించినారు. ఆల్లందరూ నన్నో పసువులా ఓడుకుంటే ఈయన నన్నో మనిసిని సేసినారు. పైగా 'అగ్నిసాక్షిగా పెళ్ళాడిన నా భార్యకి అగ్నిని రగిలించడం మాత్రమే తెలుసు. అహంకారం తప్ప ఆ జ్వాలని ఆర్పి మనశ్శాంతి ప్రసాదించడం తెలీదు. అది నీకే తెలుసు. ఇంతటి సుఖం యిచ్చిన నీకేమివ్వగలను! పది తరాలకి సరిపడే నా ఆస్తి కూడా పట్టుకుపోతానా! అందుకే ఇంతకి తెగించాను. నీ పేర ఓ యిల్లు కొన్నాను. చెడిపోయిన ఆడదాన్ని చేరదీసి, దానికింత నీడపట్టు కల్పించిన నా మగతనాన్ని చచ్చేదాకా హాయిగా గుర్తుపెట్టుకుంటాను' అంటూ ఏవేవో సెప్పేవోరు, నా ఒల్లో తలెట్టుకుని. ఆ మాట సెపితే అచ్చరాలు కూడబలుక్కుని సదవడం, సంతకం సెయ్యడం లాంటివి నేరిపినారు. 'ఒంటరిదానివి. ఈ యిల్లే నీకు ఆధారం. కాగితాలు జాగ్రత్తపెట్టుకో. ఇంతటి విశాఖపట్నంలో అదొక్కటే నీకు దిక్కు గుర్తుంచుకో' అని పాపం కన్ను మూసేదాకా సెప్తుండేవోరు.

ఇల్లంటే ఏటనుకుంతన్నారు? 'సౌజన్య ఎపార్ట్‌మెంట్స్' అనే బోరుడు కట్టపడి సదవగలనేమో కాని, అయిదంతస్తుల ఈ కోటనాటి బిలిడింగు నా నోట 'సావుజన్య వేర్పాటుమెంట్సు'గానే పలుకుతాది. ఇందల ఓ వెపార్టుమెంటులో ఓ వాటా, ఆ చూరపరాజు గోరి దర్మమా అని ఇప్పుడు నా సొంతం. ఓ పాలి మా బిలిడింగు పై డాబా మీనకొచ్చి మీరే సూడండి. కల్లు గి(రున తిరిగిపోతాయి. ఓ దుక్కుల రాగవేందరసామి కోవెలా, మరో దిక్కుల అప్పలో ఆసుపత్తిరీ! వొవడయినా ఎనక పాట్నించొచ్చి తోసేస్తే ఎముకైనా మిగల్దు! అక్కడో పొద్దు నిలబడి అటూ యిటూ సూత్తుంటే వొవలో ఎనక నుంచొచ్చి బుజం మీన సెయ్యేస్తే ఉలికిపడి ఇటు తిరిగినాను.

'ఓసోసి, ఒరనాచ్మీ నువ్వేనటే! ఎన్నాల్లకి అగుపించినావే! నీ కోసం ఎన్ని సుట్లు ఎన్ని ఊర్లు తిరిగినానే! సూసారా పీడరు బాబుగోరూ, నా అదురుట్టం బాగుండి మాయావిడ నాకు దక్కినాది. బగుమంతుడు నేడా!'

'వొవుడ్రా యీడు!' అనుకొని సూడగా సూడగా యాదికొచ్చినాది. పోయిన పుసకరాలకి నన్ను సేరదీసిన పాండ్రంకి పాపారావుగోడే. కిల్లీకొట్టు నడిపోవోడు కదూ! కానీ సంపాదన నేదు గాని యిలా సీకటడేతలికి ఆ సేతిలో సీసా ఈ సేతిలో పాపా అమరిపోవాల దొంగనాకొడుక్కి. పందికొక్కులా ఉండేవోడు పాలపీకలా తయారయాడెదవ. అలా ఆడ్ని పోలీసు లాకప్పులో ఎట్టినారని తెలీగానే ఇటు పారొచ్చినాను గానా! ఆనాడయితే యీది కుక్కని గనక యిటుమంటి సచ్చినోల్లంతా సెయ్యేసే ఓల్లు. నా కరమం కాలి ఆ దరుమాత్ముడి ఆయుసు తీరిపోనాదిగాని ఆరిచ్చిన యిల్లు ఉండనే ఉంది గంద! ఈ ఎలక నాయాల ఈ పొద్దొచ్చి వొవడ్నో తోడు తీసుకుచ్చి 'మయావిడ' అంటాడేటి? నా పేర కార్టర్సొకటి ఉందని తెలుసుకొని దాన్ని దకలు పుచ్చుకుందామని ఒచ్చినాడు కాబోలీ గుంటనక్కగోడు. ఇంకా ఆనాటి ఎర్రి ఒరనచ్మినే అనుకుంటున్నాడు పావాల!

'పాత బుద్దులన్నీ ఒగ్గేసినానె ఒరనచ్మీ. యిక ఆయిగా ఉందారి. వెపార్ట్‌మెంటు ఏదో సంపాయించి నావుట గందా, వందులో సిల్కా గోరింకాల్లో పడుందారి. నివ్వూ సెడు సావాసాలన్నీ ఇడిసేసి నావంట గందా!'

'ఆరి ఎలకా నా కొడక, ఇదిట్రా నీ ఏసకం? కోడిపిక నులిమినట్టు మనుసుల్నే నొక్కేసే మర్డరు గోడివి. నన్ను ఊదెయ్యగానికి నీకేం కట్టం'

ఇక వల్లకుండడం నా సేత కానేదు. ఇరుసుకు పడిపోనాను.

'ఏట్రా దగుల్బాజీనాయాల. 'ఆవిడ' ఆవిడంతున్నావ్. నానేం నీకు కట్టుకున్న పెల్లాన్రా? మరి నా మెల్లో సెతమానం ఏది? ఏటి పీడరు బాబూ, తమరేమంతరు?'

'అమ్మా నీలాంటి పతివ్రతామతల్లులు కట్టిన తాళినైనా పుటుక్కున తెంపగల సమర్దులే! అందుకనే మా జాగ్రత్తలో మేం ఉంటాం. ఇదిగో ఆల్బమ్‌లోని యీ ఫోటోలూ, యీ కాగితాలూ చిత్తగించండి.'

ఆడు ఎలిగించిన పెద్ద బేట్రీనయిటు ఎలుగులో అవి సూద్దునూ, కల్లు గిర్రున తిరిగినాయి. కాల్లు లొటలొట లాడినాయి.

నానూ ఆ పాపారావుగోడూ పెళ్ళి దండలేసుకోని పక్కపక్కని సిమ్మాద్రి అప్పన్న పెల్లి మండపంలో కూకున్న పోటో ఒకటి!

ఆ పోటోలోని ఆడబొమ్మ నానే. చందేగం నేదు!

అంతేనా?

వొయిజాగు అక్కయ్యపాలెం పెల్లిల్ల రిజిట్టర్ ఆపీచులో పెల్లయిన పెమానికంగా మా యిద్దరి బొమ్మలూ, చంతకాలూ!

చంతకం సెయ్యడం సూరపరాజు బాబుగోరు నేరిపినోరు గందా, అది నాదే!

ఓలమ్మ ఓలమ్మ నానేటి సేతును! ఇంతన్యాయామా, ఇంత గోరమా!

'ఓసే ఒరనొచ్మీ! సితక్కొట్టిన సింతకాయ రుసి పెరుగుద్ది గాని తగ్గదు. అంతలా తలతలలాడిపోతున్నవ్.... ఇంకాస్సేపుంటే యీ పీడరు బాబే నీ మీన సెయ్యేసేలా ఉన్నాడు. మాం ఎల్తాం. మా ఆవిడ కనిపించినాది గందా, మా చేగితుడికి నాను పారిటీ యిచ్చుకోవాల. బాగా రేతిరి ఏల ఒస్తానూ, ఒస్తాను. ఇంకేటి మనకి పెతిరాత్రీ ఒసంతరాత్రే. ఈ రాతిరే కొత్త ట్రయిలేసుకుందారి. న... గాలిలో తేలిపోయేలా చేసే పూచీ నీదే. పదండి బాబుగారూ!'

ఒ... దిగి యిద్దరూ ఎల్లిపోనారు.

నా వాటాకి సేరుకొని ఉసూరుమని కూలబడినాను. ఏటి సెయ్యాలో ఈ దురుమార్గం ఎలా అడ్డుకోవాలో ఏమాతరం దారి కాపడక కల్లనీలెట్టుకొని కూకుండిపోనాను. దొంగ సాచ్చికాలు బనాయించి కట్టుకున్న పెల్లాన్ని పీడరు నా కొడుకే బద్దమైపోనాడు. ఈ రాతిరే మల్లొస్తనంటన్నడు. ఈ పాపిస్టోణ్ణి ఒగ్గించుకోడం ఎలా? ఎలా? నన్నే దేవుడు కాపాడుతాడు!

తెలిసిన దేవుల్లందరికీ పేరుపేరు వరుసన మొక్కినాను. గాని యీ సీకట్లోంచి ఎలా బయలెల్లడమో ఏ ఒక్కరూ సెప్పినారు కారు.

'ఎవరూ చెప్పరు. నిన్ను నువ్వే రక్షించుకోవాలి'

దయిర్యం కోసం గుండెల్నీ ఆనించి ఎట్టుకున్న సూరపరాజుగారి పోటో మాటాడినట్టయినాది. తలుపు తీసుకొని ఆడు రానే ఒచ్చినాడు.

'కట్టుకున్న మగాడికి కాలికి దండమెట్టడం కాదు, గాలిలో తేలిపోయే సుకం పెసాదించాలి - బేగి రాయే'

ఆడి మాటల్లో ఏదో కొత్త అరదం తోచినాది. కొత్తగా తోసిన ఆలోసనతో నా మొగం మారిపోనాది. దారి స్పష్టంగా కనపడుతున్నాదిప్పుడు. దయిరయం తెచ్చుకొని లేసి, నిల్సుని, ఆడి సెయ్యట్టుకున్నాను.

'ఇయ్యన్నీ మరియాదస్తుల యిల్లు. పైకెల్లి మనసు తీర్చుకుందారి పద' ఫుల్‌గా ఎక్కించిన ఆ తాగుబోతుని ఆ మెట్లన్నీ ఎక్కించి డాబా మీదికి తోలికెల్లేసరికే నాకు ఎగసేస ఒచ్చినాది.

ఆ ఊసూ, ఈ ఊసూ చెబుతూ డాబా అంచుకి తోలికెల్లినాను.

'ఇంకా ఆలెస్సెం ఏటే నా రాజా రంగుల్రానీ! ఏబై దాటినా ఏపిల్ పండులా అగపడతన్నావ్ కదే!'

ముందురోజు ఓన పడిందేమో జారుజారుగా ఉంది నేల. ఓ దిక్కుల మరీ జోరుగా ఉంది. అటు నెట్టినాను.

'ఇదేం సరసమే?'

'పెల్లయి పోనాది గందా, ఇక చుబ్బరంగా చోబనం సేసేసుకుందారనీ!'

అని ఆడి అరికాల్లట్టుకున్నాను. అక్కడ కితకిత పెట్టి ఆడ్ని కిర్రెక్కించడం నాకు తెల్సిన ఇద్యే.

'ఒద్దే... ఒద్దే... ఒగ్గెయ్యవే... నాను తట్టుకోలేనే'

ఇక తట్టుకునేదేటి దొంగెదవ. కాల్లు అందుకున్నట్టే అందుకొని ఒక్క ఊపుతో పిట్టగోడ నుంచి గాలిలోకి తేల్చేశాను. కిందకయినా సూడనేదు. ఏటైపోనాడో ఎరికనేదు. ఆడు 'ఏటైనా అయిపోడమే' కదా నాను కోరుకునేది. అది జరిగినాది. అమ్మయ్య!

★

30 007
1-2722189